క్లుప్తంగా

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలకు చెక్

తిరుమలాయపాలెం: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయొచ్చని ఎస్ఐ గిరిధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎదుళ్లచెరువు గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులతో చర్చించారు. గ్రామంలో ప్రధాన సెంటర్లలో సీసీలను ఏర్పాటు చేయడం వల్ల చోరీలు, అపరిచిత వ్యక్తుల కదలికలను గుర్తించవచ్చని, అందుకు గ్రామస్తులు సహకరించాలని సూచించారు.

కరపత్రాలు ఆవిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: మొగిలి ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యాన ఈనెల 27న సోమవారం సాయంత్రం 6 గంటలకు స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో సమ్మర్ స్పెషల్‌గా 'ఆనందలహరి' పేరుతో వినోదభరిత సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నాగసాయి తెలిపారు. శుక్రవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని మిత్ర గ్రూప్ ఆఫ్ చైర్మన్ కురివెళ్ల ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగసాయి మాట్లాడుతూ.. లైవ్ ఆర్కెస్ట్రాతో నృత్య, గాన, హాస్య ప్రదర్శన ప్రముఖ కళాకారుల చేత ఉంటుందని తెలిపారు. అనంతరం కురువెళ్ల ప్రవీణ్ కుమార్ మాట్లాడగా.. ప్రముఖ కమెడియన్ మొగిలి గుణకర్ పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ..

ఇద్దరికి తీవ్ర గాయాలు

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ గ్రామ చెరువు కట్టపై శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈమేరకు ఘటనా స్థలాన్ని ఏఎస్సై రామలింగారెడ్డి సందర్శించి క్షతగాత్రులను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా, గాయపడిన వారిని తిరుమలాయపాలెం కొక్కిరేణి వాసులుగా గుర్తించారు.

పంట అవశేషాలను తగలబెట్టొద్దు



రైతులతో మాట్లాడుతున్న ఏఓ నాగేశ్వరరావు

ఖమ్మంరూరల్: గతంలో పంటకోతలు పూర్తయ్యాక మిగిలిన అవశేషాలను తగలబెట్టొద్దని ఏఓ వి.నాగేశ్వరరావు రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని గుదిమళ్లలో వరిపంట అవశేషాలను తగలబెట్టిన పంటపొలాలను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల భూమిలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులు చనిపోవడమే కాక సేంద్రీయ కర్బనం కూడా దెబ్బతింటుందని పేర్కొన్నారు. పంట అవశేషాలను భూమిలో కలియదున్నితే భూమిలో సేంద్రీయ పదార్థం పెరిగి నేల గుల్లబారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ అనుమతులకు ఇబ్బందులు

నేలకొండపల్లి: ఇంటి నిర్మాణ అనుమతులకు పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాలలో ఇళ్లు పూర్తయ్యే వరకూ అనుమతులు ఇవ్వడం లేదని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శులు అనుమతులు ఇవ్వకపోవడంతో విద్యుత్ కనెక్షన్ కోసం అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, అనుమతులు కోసం ఓ పంచాయతీ కార్యదర్శి రూ.50 వేల వరకు డిమాండ్ చేశారని ఆరోపించారు. సొంత ఇంటి నిర్మాణం చేసుకునే వారికి ఇబ్బందులు లేకుండా అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇబ్బందులు పెట్టే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	28	బచ్చలికూర	5
వంకాయ	26		20
బెండకాయ	26	పాలకూర	4
పచ్చిమిర్చి	80		20
కాకర	60	చుక్కకూర	4
బీర	66		20
దొండ	34	తోటకూర	4
చిక్కుడు	30		20
గోరుచిక్కుడు	50	గోంగూర	5
క్యాబేజీ	50		20
క్యాలీఫ్లవర్	24	మెంతికూర	4
ఆలుగడ్డ	36		20
చామగడ్డ	46	కొత్తిమీర	1
క్యారెట్	46		30
కీరాదోస	30	పుదీన	1
క్యాప్సికం	70		20

-ఖమ్మం వ్యవసాయం

పరిమితం.. ప్రయోజనం!

ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ గృహ జ్యోతి పథకంతో సామాన్యులకు ప్రయోజనం చేకూరుతోంది. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి, నెలలో 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే వినియోగదారులకు జీరో బిల్లులు వస్తుండగా.. అంతకు మించి ఒక యూనిట్ విద్యుత్‌ను వినియోగించినా మొత్తం బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈనేపథ్యాన వేసవిలో అన్ని వర్గాల వారు విద్యుత్ వినియోగం కొంతమేర పెరిగే అవకాశం ఉన్నందుకు ఉచిత విద్యుత్ లబ్ధిదారులు విద్యుత్ పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



నేలకొండపల్లిలో జీరో బిల్లు అందిస్తున్న ఏఈ రామారావు (ఫైల్)

'గృహజ్యోతి' వెలగాలంటే ఆదా చేయాల్సిందే..

- 200 యూనిట్లలోపు వినియోగించిన వారికే జీరో బిల్లు
- అవసరాలకు మించి వాడొద్దని అధికారుల సూచన
- అవగాహన కలిగేలా విస్తృత ప్రచారం

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలంలో పరిశ్రమలు ఎక్కువగా ఉండడం వలన ఎక్కువగా విద్యుత్ వినియోగించబడుతుంది. అంతేకాక గృహజ్యోతి పథకం ద్వారా నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో ఎక్కువ మంది లబ్ధిదారులకు లబ్ధి చేకూరుతోంది. అయినా అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈక్రమంలో విద్యుత్ వినియోగాన్ని 200 యూనిట్లలోపు తగ్గించుకోవాలని సూచిస్తున్నారు.

అవసరాలకు అనుగుణంగా..

పరిమితంగా విద్యుత్‌ను వినియోగిస్తే పథకం ద్వారా లబ్ధిపొందే అవకాశం ఉంటుంది. అందుకు ఎల్‌ఈడీ దీపాలు, ఐఎస్ఐ మార్కు, స్టార్ రేటింగ్ కలిగిన గృహోపకరణాలను వినియోగించటంతో పాటు అవసరం మేరకు విద్యుత్ వినియోగిస్తే విద్యుత్‌ను ఆదా చేయొచ్చు. దీంతో వ్యక్తిగతంగా ఆదా చేయడంతో పాటు ఆర్థికంగా ప్రయోజనం పొందే అవకాశం ఉంది. కాగా, కొంతమంది అవగాహన లేక విద్యుత్‌ను ఇష్టానుసారంగా వినియోగించడంతో గృహ జ్యోతికి అనర్హులవుతుండగా.. మరికొంత మంది సాంకేతిక కారణాలతో లబ్ధి పొందలేకపోతున్నారు.

అవసరానికే వాడుతాం..



అవసరానికే విద్యుత్‌ను వినియోగిస్తున్నాం. ఇంట్లో ఉపయోగించే ఫ్రిజ్, కూలర్, టీవీ లాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తరుచూ శుభ్రం చేసుకోవటం ద్వారా విద్యుత్ ఆదా అవుతుంది. ప్రయాణాలు చేసే సమయాన మెయిన్ ఆఫ్ చేసి వెళ్తాం. సాధ్యమైనంత వరకు బిల్లు అదుపులో ఉండేటట్లు చూసుకుంటాం. పిల్లలకూ ఇదే అలవాటు చేశాం.

– పి.పుష్ప, అనంతనగర్, గృహిణి,

అవగాహన కల్పించాలి..



ఉచిత విద్యుత్‌ను పొందేందుకు ఎక్కువగా విద్యుత్‌ను వినియోగించుకుండా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. 200 యూనిట్లలోపు విద్యుత్ ఖర్చుపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి. ప్రభుత్వం అందించిన గొప్ప అవకాశం అందరికి అందేలా చూడాలి.

– డి.రాధాకృష్ణమూర్తి, మంగాపురం

విద్యుత్‌ను ఆదా చేస్తే పొదుపు చేసినట్లే..

విద్యుత్‌ను ఆదా చేస్తే పొదుపు చేసినట్లే అవుతుంది. ఎల్‌ఈడీ బల్బులు వినియోగిస్తూ.. 200 యూనిట్లు లోపు విద్యుత్‌ను వినియోగించేలా చూసుకోవాలి. విద్యుత్ వాడకంపై తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ప్రభుత్వం అందించే గృహజ్యోతి పథకానికి లబ్ధిపొందాలి. అందుకు ప్రజలకు అవగాహన కలిగేలా విస్తృత ప్రచారం చేస్తున్నాం.

– కె.రామారావు, ఏఈ, నేలకొండపల్లి

ఎలక్ట్రానిక్ పరికరాలు..



కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లు అవసరం లేనప్పుడు ఆఫ్ చేయడం ద్వారా విద్యుత్ ఆదా చేయొచ్చు. కాగా, నేటికి కొందరు సంప్రదాయం విద్యుత్ బల్బులను వినియోగిస్తుండడంతో విద్యుత్ ఖర్చు అధికంగా ఉంటుంది. తక్కువ విద్యుత్ వినియోగించుకునే ఫ్యాన్లు కూలర్లు బల్బులు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నందున బ్రాండెడ్ కంపెనీల ఎలక్ట్రానిక్ పరికరాలను వినియోగించాలని, ఫ్రిజ్‌లను స్టార్ రేటింగ్ ఉన్న వాటిని కొనుగోలు చేస్తే విద్యుత్ ఆదా చేయొచ్చు.

హవేలీ అభివృద్ధిలో సీపీఎం కీలకపాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఖానాపురం హవేలీ ప్రాంత అభివృద్ధిలో సీపీఎం కీలక భూమిక పోషించిందని పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం కార్పొరేషన్‌లో విలీనానికి ముందు దాదాపు ఇరవై ఏళ్ల పాటు హవేలీ సర్పంచ్, ఎంపీటీసీ బాధ్యతలను నిర్వర్తించిన సీపీఎం హయాంలో ప్రగతి పథంలో నడిచిందని పేర్కొన్నారు. సుందరయ్య భవనంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎం హవేలీ కమిటీ ఆధ్వర్యాన పోరాట యోధుడు సత్తెనపల్లి రామకృష్ణ పేరుతో ఇందిరానగర్ సెంటర్‌లో నిర్మించిన సీపీఎం నూతన కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యాలయాన్ని ఆదివారం సాయంత్రం కేరళ ఎమ్మెల్యే, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు కే.కే.శైలజ ప్రారంభిస్తారని, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆతర్వాత ఆఫీస్ పక్కనే ఉన్న వినియోగదారుల ఫోరం స్థలంలో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా, సన్న రకం ధాన్యానికే రూ.500 బోనస్ ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం సరికాదని, దొడ్డు రకానికి కూడా బోనస్ ఇవ్వడంతో పాటు వర్షానికి దెబ్బతిన్న ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరారు. అలాగే, ఆదాయం పేరుతో రిజిస్ట్రేషన్ ఫీజుల పెంపు ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు యర్రా శ్రీకాంత్, బుగ్గవీటి సరళ, వై.విక్రమ్, తిరుపతిరావు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేయాలి



రాంజీనాయక్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

కామేపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా ప్రచారం చేయాలని సూచించారు. మండలంలోని పాతలింగాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల మాదిరి కష్టపడి ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థి విజయానికి పాటుపడాలని తెలిపారు. తొలుత గరిడేపల్లి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు బోడా రాంజీనాయక్ కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్సీ ఆహ్వానించారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, డీసీసీబీ చైర్మన్ మేకల మల్లిబాబుయాదవ్, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన..

నేలకొండపల్లి: నేలకొండపల్లి పంచాయతీలో నిర్వహిస్తున్న నర్సరీని శుక్రవారం ఎంపీడీఓ ఎం.యర్రయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలో ప్రతీ మొక్కను బతికేలా చూడాలని నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. అదే విధంగా పారిశుద్ధ్యంపై అప్రమతంగా ఉండాలని, ఉపాధి కూలీల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

17,ఆర్‌కేయం, 345, నేలకొండపల్లి నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ యర్రయ్య

3,081 ఓట్లు.. నాలుగు పోలింగ్ కేంద్రాలు

ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.యర్రయ్య తెలిపారు. శుక్రవారం నేలకొండపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీలలో 3,081 మంది ఓటర్లు ఉండగా.. నేలకొండపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ తదితరులు పాల్గొన్నారు.

రక్తపోటు నివారణపై అవగాహన

తిరుమలాయపాలెం: ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం తిరుమలాయపాలెం పీహెచ్‌సీలో రక్తపోటు నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డబ్ల్యూహెచ్‌ఓ ఎన్‌సీడీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సత్యేంద్రనాథ్ మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది రక్తపోటు నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈమేరకు హెచ్‌ఈఓ నరేష్ రక్తపోటు నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రామారావు, నాగేశ్వరరావు, ప్రదీప్‌రెడ్డి, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి చలివేంద్రం..



సాక్షి ఎఫెక్ట్..

కుండలో నీళ్లు పోస్తున్న దృశ్యం

కామేపల్లి: గ్రామ పంచాయతీల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాల పరిస్థితిపై 'నామ్‌కే వాస్తే' అనే శీర్షికను శుక్రవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎంపీడీఓ రవీందర్ మండలంలోని చలివేంద్రాలు ఏర్పాటు చేసిన అన్ని జీపీల్లో చలివేంద్రాలను అందుబాటులోకి తెచ్చేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో సంబంధిత కార్యదర్శులు చలివేంద్రాల్లో కుండలను ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించారు.

నేడు కరెంట్ కోత

ఖమ్మంగాంధీచౌక్/రఘునాథపాలెం/కూసుమంచి/ఖమ్మంఅర్బన్/కామేపల్లి/ఖమ్మంరూరల్: సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నేడు(శనివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈమేరకు నగరంలో 33/11 దానవాయిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని సారథినగర్, వాటర్ వర్క్స్, రాజీవ్ గృహకల్ప 11 కేవీ లైన్ల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సారథినగర్, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, జూబ్లీ క్లబ్ రోడ్డు, ఫిష్ హౌస్ లైన్లు, బైపాస్ రోడ్, వాటర్‌వర్క్స్, గణేష్‌నగర్, మేకల నారాయణ బోర్డు, కామంచికల్, దారెడు లైన్లలో విద్యుత్ సరఫరా ఉండదని టౌన్–1 ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 33/11 కేవీ బుర్హాన్‌పురం సబ్‌స్టేషన్, 33 కేవీ బుర్హాన్‌పురం ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు బుర్హాన్‌పురం, మామిళ్లగూడెం, నరసింహస్వామి టెంపుల్ రోడ్, మయూరిసెంటర్, మజ్జూర్ కాలనీ, లెనిన్ నగర్, వైరా రోడ్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రఘునాథపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేసీఆర్ కాలనీ, కేటీఆర్ కాలనీ, కోయచలక, రేగులచలక, ప్రగతిప్రైడు, రఘునాథపాలెం పైకాలనీ, దారేడు, శివాయిగూడెం, పువ్వాడనగర్, తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని ఏఈ ఇందిరా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అమరావతినగర్, విద్యానగర్, గణేష్‌టౌన్‌షిప్, పాండురంగాపురం తదితర కాలనీల్లో అంతరాయం ఉంటుందని బల్లేపల్లి సెక్షన్ ఏఈ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా కూసుమంచి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో పాలేరు, నర్సింహులగూడెం, పోచారం, మంగలితండా, పెరికసింగారం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధితో పాటు వాటర్‌గ్రిడ్‌కు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ కొక్యా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కామేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 10 గంటలకు వరకు కామేపల్లి, ఊట్కూర్, రామకృష్ణాపురం, తాళ్లగూడెం, టేకులతండాలకు కరెంట్ ఉండదని ఏఈ శ్రీనివాసులు తెలిపారు. అంతేకాక ఖమ్మంరూరల్ మండలంలోని పెదతండా సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు ఏదులాపురం, పెదతండా గ్రామపంచాయతీ పరిధిలోని సాయిగణేష్‌నగర్, అభయటౌన్‌షిప్, సింగరేణికాలనీ, టీఎన్‌జీఓస్‌కాలనీలలో కరెంట్ ఉండదని ఏఈ క్రాంతిసింహ తెలిపారు.

21 నుంచి బ్రహ్మోత్సవాలు

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ 14వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు ముదుంబ మురళీకృష్ణమాచార్యులు తెలిపారు. 21న బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండగా, 22న ధ్వజారోహణం, 23న తిరుకల్యాణ మహోత్సవం, 24న విశ్వశాంతి కోసం సంక్షేమ రామాయణ హవనం, 25న సామూహిక కుంకుమపూజ, రథోత్సవం ఉంటాయని వెల్లడించారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజయచంద్ర

నేలకొండపల్లి: రైతులు కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు రశీదు ఇవ్వాలని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎస్.విజయచంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ పరిపతి సంఘం గోడౌన్లు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎరువుల దుకాణంలో కొనుగోలు చేసిన వాటిని తప్పకుండా దరఖాస్తు అందించాలని ఆదేశించారు. అలాగే ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దుకాణా యజమానులు తప్పకుండా రికార్డు నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. సబ్సిడీపై అందిస్తున్న జీలుగులు, జనుములను ఆయా సొసైటీలలో అందుబాటులో ఉంచగా.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి డి.అరుణకుమారి, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కామేపల్లి: మండలంలోని విత్తన, ఎరువుల దుకాణదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో డీలర్లకు అవగాహన కల్పించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. డీలర్లు ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన వాటినే అమ్మాలని, స్టాక్ వివరాలను స్టాక్ బోర్డులో నమోదు చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీకన్య, డీలర్లు కాలం ఉపేందర్‌రెడ్డి, గంగారపు నాగేశ్వరరావు, భూక్యా శ్రీను, బాలాజీ, అంబడిపూడి హరీష్, రమేష్, నల్లమోతు రవి తదితరులు పాల్గొన్నారు.

విలీన ప్రక్రియ పూర్తి చేయాలి



కరపత్రాలతో యూనియన్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: గత ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ 90 శాతం పూర్తి చేసిందని, పది శాతం ప్రక్రియను పూర్తి చేసి అపాయింటెడ్ తేదీని వెంటనే ప్రకటించాలని టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం డిపో కార్యదర్శి బేతంపూడి బుచ్చిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం డిపో కమిటీ ఆధ్వర్యాన ఈనెల 21న నిర్వహించే చలో బస్ భవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఖమ్మం డిపో గేటు వద్ద డ్రైవర్, కండక్టర్, మెకానికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, టికెట్ తీసుకునే పూర్తి బాధ్యత ప్రయాణికుడిదేనని సర్క్యులర్ తీసుకురావాలని కోరారు. ఆర్‌పీఎస్ బాండ్, ఏరియర్స్ డబ్బులు చెల్లించాలని, సస్పెండ్, రిమూవ్ అయిన ఉద్యోగుల కేసులను పరిశీలించి విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు దేశబోయిన జగన్నాథం, నారాయణ, సంగయ్య, రాధ, శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..

కామేపల్లి: కామేపల్లి డీసీసీబీ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన రామస్వామిని శుక్రవారం డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ శాలువ కప్పి సన్మానించారు. బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలని, రైతులకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎండీ ఆసిఫ్‌అలీ, అసిస్టెంట్ మేనేజర్ రామారావు, క్యాషియర్ తస్లీమ్, నరసయ్య, శీలం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: దేశవ్యాప్తంగా తిరుగుతున్న ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్, స్పెషల్ ట్రైన్‌లలో ప్రతీ రైలుకు ఆరు జనరల్ బోగీలను కేటాయించాలని సీపీఐ ఆధ్వర్యాన ఖమ్మం స్టేషన్ సూపరింటెండెంట్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. ప్రతీ రైలుకు ముందు రెండు, వెనుక రెండు జనరల్ బోగీలతో పాటు ఒక ఎస్ఎల్ఆర్ బోగీ ఉండాలన్నారు. సీనియర్ సిటిజన్లకు కరోనా సమయాన తొలగించిన పలు రాయితీలను వెంటనే పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వర్లు, పోటు కళావతి, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, రావి శివరామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు గాదె లక్ష్మీనారాయణ, ఇటికాల రామకృష్ణ, తాటి నిర్మల, నంబూరి శంకర్రావు, మేకల రవి, మధిర మండల కార్యవర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ పాల్గొన్నారు.

తాగునీరు అందించాలని..

ఖమ్మంమయూరిసెంటర్: కలుషితమైన నీటిని శుభ్రపరిచి మంచినీటిని అందించాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎర్ర శ్రీనివాసరావు అన్నారు. ఈమేరకు శుక్రవారం మున్సిపల్ అధికారులకు సీపీఎం త్రీ టౌన్ ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఖమ్మం త్రీటౌన్‌లోని సారథినగర్, ప్రకాష్‌నగర్, శ్రీనివాస్‌నగర్ ప్రాంతాల్లో తాగునీరు పచ్చగా వచ్చి రోగాల బారిన పడుతున్నారన్నారు. ఇకనైనా శుభ్రమైన నీటిని అందించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఎం త్రీ టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు, 35వ డివిజన్ కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, సీనియర్ నాయకులు బండారు యాకయ్య, త్రీ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ హిమాం తదితరులు పాల్గొన్నారు.

రాకేష్‌రెడ్డిని గెలిపించుకోవాలి



మాట్లాడుతున్న వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: శాసనమండలికి నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి జరుగుతున్న ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేష్‌రెడ్డి పోటీ చేస్తున్నారని, పట్టభద్రులంతా ఆయనను బలపరిచి గెలిపించుకోవాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఖమ్మంలోని ఓ హోటల్ న్యాయవాదులతో రాగేష్‌రెడ్డి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సీనియర్ న్యాయవాది తిరుమలరావు అధ్యక్షత వహించగా వద్దిరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు, సీనియర్ నాయకులు ఆర్జేసీ కృష్ణ, న్యాయవాదులు సుగుణారావు, రెంటాల ఆనంద్, కొత్త వెంకటేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాస్, ముక్తేశ్వరరావు, చింతల వెంకటేశ్వరరావు, దిలీప్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు కలిసి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మంలోని స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పగడాల నాగరాజు, శీలంశెట్టి వీరభద్రం ఉన్నారు.

'ఉపాధి' కల్పించడమే లక్ష్యం

కామేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతీ కూలీకి పని కల్పించడమే లక్ష్యమని అడిషనల్ డీఆర్‌డీఓ బి.శిరీష అన్నారు. శుక్రవారం మండలంలోని జాస్తిపల్లి, ముచ్చర్ల గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈజీఎస్ ద్వారా చేపట్టే పనులతో భూగర్భజలాల పెంపునకు దోహదపడతాయని, చెరువుల్లో పూడికతీత మట్టిని ట్రాక్టర్ల ద్వారా రైతులు తమ పంట చేలోకి తరలించుకోవాలని సూచించారు. నిర్దేశించిన కొలతల మేరకు పూడిక తీయాలని, ప్రతీ కూలీకి రూ.300 వచ్చేలా పని కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు నీడ, తాగునీటి సౌకర్యాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీరాణి, ఈసీ వెంకటేశ్వర్లు, కార్యదర్శులు రవికుమార్, రమేశ్, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్, డేవిడ్ రాజ్, బావ్‌సింగ్, ఫీల్డ్ అసిస్టెంట్లు రాంబాబు, మంజుల, వారన్న, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆవు అవస్థలు..!



కాల్వలో పడిన ఆవు



తాళ్లతో లాగుతున్న స్థానికులు



బయటపడ్డాక ఇలా..

నగరంలోని శాంతినగర్ హైస్కూల్ సమీపాన రోడ్డు పక్కన ఉన్న ఓ మురుగు కాల్వలో శుక్రవారం ఓ ఆవు ప్రమాదవశాత్తు పడింది. ఇది గమనించిన స్థానికులు దాసరి శివ, రవిశంకర్, కమల్, వెంకటేష్‌లు దానిని తాళ్లతో కట్టి బయటకు లాగగా అది క్షేమంగా బయటపడింది. – ఖమ్మంక్రైం